క్లుప్తంగా

హక్కుల సాధనకు మాదిగలు కృషి చేయాలి



మైలవరం: మాదిగలు తమ హక్కుల సాధనకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య అన్నారు. మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో మాదిగల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ మాదిగలు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకోవాలన్నారు. వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపాలని సూచించారు. సోషల్ వెల్ఫేర్ విశ్రాంత అధికారి చాట్ల వీరాస్వామి, మాజీ ఎంపీపీ హన్నా సుభాషిణి, సర్పంచ్ మంజుభార్గవి, మాజీ జెడ్పీటీసీ దొండపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

275 మందికి వైద్య పరీక్షలు



పెనుగొలను(గంపలగూడెం): తిరువూరు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పెనుగొలనులో ఉచిత వైద్య సేవా శిబిరం నిర్వహించారు. డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు, బాలాజీ, సత్యనారాయణ, ప్రసాద్ 275 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు, జి. నరసింహారావు, ఎస్. హనుమంతరావు, వి. వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

తిరువూరు రచయితలకు సత్కారం



తిరువూరు: విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో ఆదివారం తిరువూరు రచయితల సంఘంలోని పలువురు కవులను నిర్వాహకులు సత్కరించారు. అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహించిన శత కవుల సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న తిరువూరు రచయితలు ఈడే భరతకుమారి, వి. శంకరాచారిలను నిర్వాహకులు పొట్లూరి హరికృష్ణ, విజయలక్ష్మి సన్మానించారు.

అనాథాశ్రమాన్ని సందర్శించిన రామానుజ జియర్ స్వామి



తిరువూరు: స్థానిక తోకపల్లి రోడ్డులోని పరిపూర్ణ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న అనాథాశ్రమాన్ని త్రిదండి అహోబిల రామానుజ జియర్ స్వామి ఆదివారం సందర్శించారు. గత ఆరు రోజులుగా తిరువూరు కోదండ రామస్వామి ఆలయంలో భాగవత సప్తాహం నిర్వహిస్తున్న ఆయన అనాథాశ్రమంలో చిన్నారులతో ముచ్చటించారు. మానవ సేవే మాధవసేవని, బాలలకు కావలసిన సదుపాయాలు కల్పించేందుకు తగు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. రమణ మహర్షి ఆశ్రమంలోని వృద్ధులు, దివ్యాంగులను స్వామి పరామర్శించారు. పరిపూర్ణ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సిరికొండ నాగేశ్వరరావు, రమణ మహర్షి ఆశ్రమ నిర్వాహకుడు వెంపాటి అబ్రహం, వేద పండితులు ఎస్‌సీహెచ్ విఠల్ పాల్గొన్నారు. కోదండరామాలయంలో భాగవత సప్తాహంలో జియర్ పాల్గొన్నారు.

ప్రణాళికా సదస్సుకు హాజరు కావాలి

ముసునూరు: ప్రజా వేదిక కోసం నిర్వహిస్తున్న ముందస్తు ప్రణాళికా సదస్సుకు రెవెన్యూ సిబ్బంది అందరూ హాజరుకావాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జరుగనున్న ప్రజావేదిక కార్యక్రమానికి ముందస్తు ప్రణాళిక తయారీ కోసం సిబ్బంది ఎంపీడీఓ కార్యాలయానికి హాజరు కావాలని, అనంతరం రెవెన్యూ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కావాలని చెప్పారు.

చలిగాలులతో గజగజ

చాట్రాయి: ఫెంగల్ తుపాను తీరం దాటడంతో ఆదివారం మండలంలో చలిగాలులు తీవ్రంగా వీచాయి. సీతాకాలం కావడం, వాతావరణంలో వచ్చిన మార్పులతో వీస్తున్న చలిగాలులకు తోడు చిన్నపాటి జల్లులు పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా తుపాను తీరం దాటడం, భారీ వర్షాలు పడకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

అప్పుడు అవునని.. ఇప్పుడు కాదని

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పీహెచ్‌సీ మంజూరు
- మూడేళ్ల కిందట భవన నిర్మాణానికి రూ.2.26 కోట్లు మంజూరు
- చనుబండలో 1.07 ఎకరాల స్థలాన్ని అందించిన దాత
- స్థలం అనువైనది కాదంటూ కొందరు అభ్యంతరం
- ఆస్పత్రి భవన నిర్మాణానికి అడ్డంకులు
- గ్రామస్తుల ఆగ్రహం

ప్రజారోగ్య పరిరక్షణకు మంజూరైన ఆస్పత్రి భవన నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో మండల పరిధిలోని చనుబండ గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారు. నిధులు కూడా మంజూరయ్యాయి. అధికారులు స్థలాన్ని పరిశీలించి అనువైనదిగా తేల్చారు. ఎన్నికలు రావడంతో సీన్ రివర్స్ అయింది. ప్రభుత్వం మారడంతో ఈ భూమి అనువైనది కాదంటూ పలువురు అభ్యంతరం చెబుతుండటంతో ఆస్పత్రి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇరుకు గదులతో వైద్యులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

చాట్రాయి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చనుబండ గ్రామానికి పీహెచ్‌సీని మంజూరు చేశారు. మూడేళ్ల కిందట మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో ఆస్పత్రి నిర్మాణానికి సుమారు రూ.2.26 కోట్లు మంజూరయ్యాయి. భవన నిర్మాణానికి గ్రామంలోని హైస్కూల్ సమీపంలో మెయిన్ రోడ్డు పక్కన సుమారు 1.07 ఎకరాల భూమిని సేకరించారు. సేకరించిన భూమిని రెవెన్యూ ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించి ఆస్పత్రి నిర్మాణానికి అనువుగా ఉందని నిర్ధారించారు. దీంతో గ్రామానికి చెందిన మల్లెం శ్రీనివాసరావు (ఎన్ఆర్ఐ) తన తల్లిదండ్రులు మల్లెం రాధాకృష్ణమూర్తి తల్లి సత్యవతి పేర్ల మీదుగా 1.07 ఎకరాలను సుమారు రూ.27 లక్షలకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి అందజేశారు. అప్పట్లో ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతులు రావడంతో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు, సిబ్బందిని నియమించి, వైద్య పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అద్దె భవనంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు.



చనుబండలో ఆస్పత్రి నిర్మాణానికి సేకరించిన స్థలం

అప్పుడు ఒకే.. ఇప్పుడు అడ్డంకులు

ఎన్నికల ముందు అధికారులు భవన నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తిరిగి టెండర్లు పిలవలేదు. ప్రభుత్వం మారిన తరువాత ఆస్పత్రి నిర్మాణానికి ఈ స్థలం అనువుగా లేదని కొంత మంది అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆస్పత్రి నిర్మాణానికి రాజకీయ అవరోధాలు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు గత ప్రభుత్వం చనుబండలో ఆస్పత్రి నిర్మాణానికి సేకరించిన భూమి అనువైనదని గతంలో అధికారులు కూడా సమ్మతి తెలియజేశారని, ఇప్పుడు కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నాం

కొత్తగా మంజూరైన ఆస్పత్రిని అద్దె భవనంలో కొనసాగిస్తూ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. భవనం చిన్నదిగా ఉండడంతో రక్త పరీక్షలకు రోగులను చాట్రాయి ఆస్పత్రికి పంపించాల్సి వస్తోంది.

– దాణావతు దుర్గాప్రసాద్, వైద్యులు, చనుబండ

ఆస్పత్రి భవన నిర్మాణం చేపట్టాలి

ప్రభుత్వం మారడంతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టలేదు. చాలా గ్రామాల ప్రజలకు ఆస్పత్రి చాలా అవసరం. ఇప్పటికైనా ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రి నిర్మాణం త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలి.

– మోరంపూడి నాగేశ్వరరావు, సూరంపాలెం

రోగులకు ఇబ్బందులు

ఆస్పత్రి నిర్వహిస్తున్న అద్దె ఇల్లు వైద్య సేవలకు అనుకూలంగా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి.

– వనమా వాసు, చనుబండ

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'మీకోసం'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆర్డీఓ మోవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విస్సన్నపేట: ప్రతిభావంతులైన పేద కాపు విద్యార్థులకు ప్రోత్సాహక ఉపకార వేతనాలు కోపా ట్రస్ట్ విస్సన్నపేట ఆధ్వర్యంలో అందజేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ట్రస్ట్ డైరెక్టర్, ట్రెజరర్ తుంగల నరేంద్రబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విస్సన్నపేట, తిరువూరు, గంపలగూడెం, ఎ. కొండూరు, నూజివీడు, చాట్రాయి, మైలవరం, రెడ్డిగూడెం మండలాల పరిధిలోని ప్రతిభావంతులైన పేద కాపు విద్యార్థులు ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు చదువుతున్న వారు తమ దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోగా అందజేయాలన్నారు. ఇతర వివరాలకు సెల్: 98666 06304, 83673 26304 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎయిడ్స్ వ్యాధి బారిన పడవద్దు

పెనుగొలను(గంపలగూడెం): ఎయిడ్స్ అంటించుకునే వ్యాధి అని, ఇది అంటువ్యాధి కాదని ప్రముఖ వైద్య నిపుణుడు తాళ్లూరి రామకోటేశ్వరరావు అన్నారు. పెనుగొలనులో సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనైతిక కార్యకలాపాలతో ఎయిడ్స్ వ్యాధి వస్తుందని, ఈ వ్యాధికి తొలుత గొంతునొప్పి, అలసట, జ్వరం, హఠాత్తుగా బరువు తగ్గిపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే వ్యాధి తీవ్రతరం కాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం: సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. గంపలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను సర్పంచులకు తప్పక తెలియజేయాలన్నారు. శాఖల వారీగా జరుగుతున్న పనుల గురించి ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజకీయాల కతీతంగా అభివృద్ధి పనులు జరగాలని చెప్పారు. గంపలగూడెం సర్పంచి కోట పుల్లమ్మ మాట్లాడుతూ గంపలగూడెం మెయిన్ రోడ్డులో పక్కా డ్రెయినేజీలు నిర్మించాలని, సీసీ రహదారులు మంజూరు చేసే చోట ముందుగా డ్రయినేజీలు కట్టాలని సూచించారు. ఊటుకూరు–దుందిరాలపాడు రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని దుందిరాలపాడు సర్పంచి బంకా బాబూరావు కోరారు. తోటమూలలో ఆక్రమణలను తొలగించి డ్రెయినేజీల సమస్య పరిష్కరించాలని పెద కొమెర ఎంపీటీసీ బుచ్చిరామయ్య కోరారు. అమ్మిరెడ్డిగూడెంలో పొలాలకు వెళ్ళే రహదారి అభివృద్ధికి రూ.3లక్షలు కేటాయించాలని సర్పంచి బజ్జూరి చంద్రశేఖర్ కోరగా, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో లింకు రోడ్ల అభివృద్ధి, డ్రెయినేజీల సమస్యల పరిష్కారానికి ఎవరైనా అడ్డు పడితే పోలీసుల సహకారంతో పనులు జరపాలని ఈఓపీఆర్‌డీ బాబూరావును ఆదేశించారు. మంచినీటి సమస్య కారణంగా తెలంగాణకు వెళ్లి కొనుగోలు చేయాల్సి వస్తోందని గోసవీడు ఎంపీటీసీ జయలక్ష్మి ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న పాత వాటర్ ట్యాంకును తొలగించాలని కోరారు. బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మించాలని అనుముల్లంక, రాజవరం సర్పంచులు దీప్తి, చెన్నుపాటి నరసింహారావు కోరారు. రూ.1.13 కోట్లతో ఎంపీటీసీల పరిధిలో చేపట్టనున్న పలు పనులకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఇటీవల మృతిచెందిన చింతల నర్వ సర్పంచి జాన్‌కోటయ్య మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిముషాలు సభ్యులు మౌనం పాటించారు. జెడ్పీటీసీ కోట శామ్యూల్, ఎంపీడీఓ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఒకటో వార్డులో ఎమ్మెల్యే పర్యటన..

తిరువూరు: స్థానిక సమస్యలు తెలుసుకునేందుకు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం మనవూరు కార్యక్రమం ప్రారంభించారు. తిరువూరు నగర పంచాయతీ ఒకటో వార్డులో పర్యటించిన ఎమ్మెల్యేకు తాగునీటి సమస్య పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం కల్పించాలని, అర్హత కలిగివున్నప్పటికీ మంజూరు కాని పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని పలువురు కోరారు. వారంలో నాలుగు రోజులు వార్డుల్లో పర్యటిస్తానని, దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

తగ్గిపోతున్న మామిడి విస్తీర్ణం

- వ్యాపారుల సిండికేట్‌తో తగ్గుతున్న ధరలు
- గిట్టుబాటు కాక రైతులకు నష్టాలు
- తోటలను నరికివేస్తున్న రైతులు

మైలవరం: గతంలో రారాజుగా వెలుగొందిన మామిడి ప్రస్తుతం కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. మామిడికి అంతర్జాతీయంగా ఎంతో ఆదరణ ఉంది. మామిడి రవాణా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం సమకూర్చి పెట్టే మధుర ఫలం ప్రస్తుతం గడ్డు కాలం ఎదుర్కొంటోంది. వాతావరణంలో మార్పులు, ప్రభుత్వం నుంచి ఆదరణ లేకపోవడంతో కాయలు కొనుగోలు చేసే వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను మోసం చేస్తుండటంతో సరైన ధర రాక రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనితో మామిడి తోటలను నరికి వంట చెరకుగా విక్రయిస్తున్నారు.

నిలకడ లేని ధరలు..

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం మండలంలో 6 వేల ఎకరాలు, జి.కొండూరు మండలంలో 5 వేలు ఎకరాలు, రెడ్డిగూడెం మండలంలో 11 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ఆదరణ లేకపోవడంతో కనీసంగా 10 వేల ఎకరాల్లో మామిడి తోటలు నరికి వేస్తున్నట్లు సమాచారం. విస్సన్నపేట, రెడ్డిగూడెం, చాట్రాయి, జి.కొండూరు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే చాలా వరకు అంతరించిపోయాయి. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొత్త మంగాపురంలో మామిడి తోట



రెడ్డిగూడెంలో నరికేసిన మామిడి తోట (ఫైల్)

ప్రభుత్వం ఆదుకోవాలి

మామిడి రైతులకు సబ్సిడీపై కవర్లు, చిక్కాలు ప్రభుత్వం అందించాల్సి ఉంది. గతంలో రెడ్డిగూడెంలో మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. కానీ ఆ దిశగా ఇప్పటివరకు అడుగులు పడలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

జి. శ్రీనివాసరెడ్డి, రైతు, మైలవరం

కార్తిక వన భోజనాల సందడి

ఇబ్రహీంపట్నం: కార్తిక మాసం చివరి ఆదివారం సందర్భంగా పలు గ్రామాల్లో వన భోజనాల సందడి నెలకొంది. కొండపల్లి ఖిల్లాపైన పర్యాటకులు ఆద్యంతం ఉత్సాహంగా గడిపారు. ఖిల్లాపైన పురాతన కట్టడాలను చూసి పులకించిపోయారు. నర్తనశాల, కారాగారం, అత్తాకోడళ్ల కోనేరు, మార్కెట్ యార్డ్ తదితర ప్రాంతాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. మ్యూజియంలో ఏర్పాటు చేసిన పురాతన శిల్పసంపద, పూర్వపు రాజుల చిత్రపటాలు ఆకట్టుకున్నాయి. మూలపాడులోని సీతాకోక చిలుకల పార్క్‌లో సందర్శకులు సందడి చేశారు. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు అక్కడి ఓపెన్ జిమ్, పార్క్‌లోని క్రీడా పరికరాలతో ఉల్లాసంగా గడిపారు. ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన ప్రధాన గేటు వద్ద సెల్ఫీలు, గ్రూపు ఫొటోలు దిగారు. సహపంక్తి భోజనాలు చేశారు.



మూలపాడు సీతాకోక చిలుకల పార్క్ ప్రధాన గేటు వద్ద సందర్శకులు

నిత్యావసరాలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: గుడ్ సమరిటన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు సౌమ్య, వెంకటమ్మ ఆర్థిక సహాయంతో ఇబ్రహీంపట్నం ఫెర్రీలో వృద్ధులు, వితంతువులకు నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు చిట్టేలు కోటేశ్వరరావు, హరీష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు గుడ్ సమరిటన్ ట్రస్ట్ ప్రారంభించిందన్నారు. ఇప్పటి వరకు అనేకమంది దాతలు ముందుకొచ్చి తమ ట్రస్ట్ ద్వారా పేదలకు ఆర్థిక సహాయం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో తమ సేవలు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నాగమణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కిలేశపురం గ్రామదేవత గంగానమ్మ అమ్మవారి ఆలయంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కిరణ్ అమ్మవారిని కృష్ణా జలాలతో శుద్ధిచేసి ప్రత్యేకంగా అలంకరించారు. వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, బాలాజీ దంపతులు భక్తులతో కలిసి అమ్మవారికి అభిషేకం, కుంకుమపూజ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



అలంకరణలో గంగానమ్మ

ఆగిరిపల్లి: కార్తిక మాసం చివరి రోజు ఆదివారం భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. స్థానిక గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు దేవులపల్లి శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వరాహ పుష్కరిణి వద్ద ముక్తేశ్వర స్వామి ఆలయంలో, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఇచ్చిన హామీ మేరకు నివేశన స్థలాలివ్వాలి: సీపీఐ

తిరువూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఎ.కొండూరు మండల నాయకుడు దాడి ఆదినారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఎ.కొండూరు మండలం గొల్లమందల గ్రామ శాఖ విస్తృత సమావేశం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులందరికీ మూడు సెంట్ల ఇళ్ల స్థలాలిస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఆదినారాయణ కోరారు. 50 సంవత్సరాలు నిండిన అందరికీ పెన్షన్లు ఇవ్వాలని, విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, గ్రామ శాఖా కార్యదర్శి కోలా లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ఒడియరాజుల ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం స్థానిక ఎంవీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా ఒర్సు కాశేశ్వరరావు, అధ్యక్షుడిగా ఇర్ల దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా కుంచం శివ, కోశాధికారిగా ఒర్సు అమరనాథ్‌తో పాటు పలువురు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, సోషల్ మీడియా ఇన్‌చార్జిలు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘం బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గ సభ్యులు

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపించొద్దు

నూజివీడు: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఇది అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై సానుభూతి చూపాలని చెప్పారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రకృష్ణ మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని, నియంత్రణ మాత్రమేనని చెప్పారు. ప్రస్తుతం ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల కోసం అనేక రకాల మంచి మందులు అందుబాటులో ఉన్నాయని, వాటిని వాడటం ద్వారా వారి జీవిత కాలం దాదాపు 20 ఏళ్లు పెరుగుతుందని వివరించారు. పట్టణ ఎస్ఐ జి. జ్యోతిబసు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జడ్జి వి. వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్

నవంబర్‌లో 52 ఎక్సైజ్ కేసులు నమోదు

ఎక్సైజ్ సీఐ మస్తానయ్య

నూజివీడు: స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ నాలుగు మండలాల పరిధిలో నవంబర్‌లో ఎక్సైజ్ సిబ్బంది చేసిన దాడుల్లో ఎక్సైజ్ నేరాలకు సంబంధించి 52 కేసులు నమోదు చేసి 12,810 లీటర్ల సారాను ధ్వంసం చేశామని, 331 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 87 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని 17 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. నాలుగు మండలాల తహసీల్దార్ల వద్ద 40 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశామని చెప్పారు. తెలంగాణకు చెందిన 31 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. నాలుగు మండలాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహించినా, సారా తయారీ, విక్రయాలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతుంటే సెల్‌ 99495 39933 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న నూజివీడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది

ప్రమాదకరంగా గుంతలు

ఆగిరిపల్లి: మండలంలోని చొప్పరమెట్ల నుంచి వట్టిగుడిపాడు వరకు ఉన్న ప్రధాన రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రయాణం కష్టతరంగా మారుతోందని అంటున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చొప్పరమెట్ల నుంచి వట్టిగుడిపాడు వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడి చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. మండలంలోని పోలవరం గ్రామంలో ఆదివారం దాడులు నిర్వహించి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. తయారీదారుడు కలవకొల్లు రెడ్డయ్య పారిపోవడంతో అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఈశ్వరరావు, ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.